భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని

ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

హిమాయత్‌నగర్: భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ల 93వ వర్ధంతి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఘనంగా నిర్వహించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కె.ధర్మేంద్ర డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.తిరుమలై సమక్షంలో భగత్ సింగ్ 93వ వర్ధంతికి సంబంధించిన కరపత్రాన్ని శుక్రవారం నారాయణగూడలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భగత్ సింగ్ జీవితం భారత దేశ యువతకు స్ఫూర్తిదాయకమని, అటువంటి మహనీయుని త్యాగాలను నేటి సమాజానికి తెలపాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వారి వర్ధంతిని పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా క్రీడోత్సవాలు, వ్యాస రచన, చిత్రలేఖన పోటీలు, సదస్సులు, ర్యాలీలు, కాగడాల ప్రదర్శన వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ లింగం రవి, నానబాల రామకృష్ణ, యుగంధర్, పేరబోయిన మహేందర్, సత్య ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సైడర్ ఎలక్ట్రికల్ ఉత్పత్తుల ఎగ్జిబిషన్

బాలానగర్: జేఎన్‌టీయూలో శుక్రవారం సైడర్ ఎలక్ట్రికల్ కంపెనీ వారు ఉత్పత్తి చేసిన పలు ఎలక్ట్రికల్ వస్తువులను ప్రదర్శించారు. ఈ కంపెనీ ప్రారంభించి 60 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశంలో అతి పెద్ద నగరాల్లోని ప్రముఖ కంపెనీలతో పాటు, పలు యూనివర్సిటీలో వారు ఉత్పత్తి చేస్తున్న అనేక వస్తువుల తయారీ విధానం వాటి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ డా. కట్టా నర్సింహా రెడ్డి మాట్లాడుదారు. డిజిటల్ అండ్ ఇన్నోవేషన్ వల్ల కలిగే బహుళ ప్రయోజనాలు గురించి తెలిపారు. పొల్యూషన్ లేకుండా మనం ఎలా మన అవసరాలు తీర్చుకోవచ్చు అనే విషయం సైడర్ కంపెనీ వారు గొప్ప పరిశోధన చేసి మంచి పరిష్కారం చూపటం అభినందనీయమన్నారు.

◆ అంతేకాకుండా మనం థర్మల్ పవర్‌పై కూడా చాలా ఆధారపడ్డామన్నారు. బొగ్గు తవ్వటం వల్ల ప్రజలు కాలుష్యంతో చాలా ఇబ్బందులు పడుతున్న సందర్భం మనం చూస్తున్నామన్నారు. మనం రేపటి అవసరానికి ముందే జాగ్రత్త పడాలన్నారు. శక్తి సామర్థ్యమును ఎలా ఉపయోగం కలుగుతుంది అన్న విషయం విద్యార్థులు అవగాహన చేసుకోవాలన్నారు. ఓవర్ లోడ్‌తో కలిగే ఇబ్బందిని కంపెనీ తయారు చేస్తున్న ప్రొడక్ట్ వల్ల ఎంతో ఉపయోగం ఉందన్నారు. ఇటువంటి కంపెనీలతో మమేకమైన కొత్త విషయాలు నేర్చుకొని దేశానికి ఎంత చేయగలిగితే అంత చేయాలన్నారు. ఈ ఎగ్జిబిషన్‌ను మెకానికల్ డిపార్టుమెంట్ అధ్యాపకురాలు ప్రొఫెసర్ పి. భ్రమరా ఆధ్వర్యంలో నిర్వహించారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, డైరెక్టర్లు, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ డా. ప్రసన్న, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సవాళ్ల పరిష్కారానికి సాంకేతికతను ఉపయోగించాలి



యూజీసీ చైర్మన్ ప్రొఫెసర్ జగదీష్‌కుమార్‌తో ముచ్చటిస్తున్న వీసీ ప్రొఫెసర్ బీజేరావు

రాయదుర్గం: ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్ళకు పరిష్కారాలను కనుగొనడానికి సాంకేతిక పురోగతిని ఉపయోగించాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) చైర్మన్ ప్రొఫెసర్ ఎం జగదీష్‌కుమార్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో ఇన్నోవేటివ్ రీసెర్చ్ ఎంటర్‌ప్రైజెస్(ఎస్పైర్) అసోసియేషన్ ఫర్ సైంటిఫిక్ పర్స్యూట్స్ 6వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రస్తుతం జీవ వైవిధ్యం మరొక ముఖ్యమైన సమస్యగా మారిందని, దీన్ని పరిక్షించడానికి అందరూ కృషి చేయాలన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విధులను సక్రమంగా నిర్వహిస్తూనే ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నా రు. మన దేశంలో మహిళలు సాధిస్తున్న ప్రగతిని మనం చూడాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయ ఉత్పత్తులు పెంచడంలో రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు ఎస్పైర్ బయోనెస్ట్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ అనీల్ కొండ్రెడ్డి పాల్గొన్నారు.

మధుమేహం, రక్తపోటు లేదు..

గుండెపోటు వచ్చింది!

వెంటనే స్టంట్ వేసి ప్రాణాలు కాపాడిన అమోర్ ఆస్పత్రి వైద్యులు

కూకట్‌పల్లి: ఓ వ్యక్తికి గుండెలోని వెసెల్ 99శాతం బ్లాక్ అయ్యింది. వైద్యులు వెంటనే గుర్తించి స్టంట్ వేసి అతడి ప్రాణాలు కాపాడారు. ఈ సంఘటన కూకట్‌పల్లిలోని అమోర్ ఆస్పత్రిలో జరిగింది. అమోర్ ఆస్పత్రి కన్సల్టెంట్ కార్డియాలజిస్టు డాక్టర్ ఇమ్రాన్ ఉల్ హక్ వివరాలు వెల్లడించారు. 48 ఏళ్ల వయసు ఉన్న మధు అనే వ్యక్తికి మధుమేహం, రక్తపోటు లాంటివి ఏమీ లేదు. ఉదయం కాస్త నొప్పిగా అనిపించటంతో ఆస్పత్రికి వచ్చాడు. అతడికి వైద్య పరీక్షలు చేయగా ఎటువంటి రోగ లక్షణాలు లేవు. ఒక వాల్వు సరిగా కదలటం లేదు. లక్షణాలను బట్టి యాంజియోగ్రామ్ చేశారు. కాసేపట్లో అతనికి గుండె నొప్పి వచ్చింది. దీంతో వైద్యులు వెంటనే స్పందించి అతడికి యాంజియో చేశారు. గుండె వెసెల్‌లో 99శాతం పూడిక ఉంది. దీంతో ఆయనకు స్టంట్ వేశామని తెలిపారు.

◆ స్టంట్ వేశారు..

ఈ సందర్భంగా రోగి మధు మాట్లాడుతూ.. తాను కర్మాగారంలో మిషిన్ ఆపరేటర్‌గా పనిచేస్తానని తెలిపారు. రోజు లాగా డ్యూటీకి వెళ్లి పనిచేస్తుండగా ఎడమ చెయ్యి కాస్త నొప్పిగా ఉందనిపించిందని తెలిపారు. కొంచెం సేపు విశ్రాంతి తీసుకున్నానని తెలిపారు. తరువాత తిరిగి 10 నిమిషాల్లో నొప్పి వచ్చి చెమటలు పట్టాయని పేర్కొన్నారు. వెంటనే అమోర్ ఆస్పత్రి వైద్యులను సంప్రదించాను. ఇక్కడ వైద్య పరీక్షలు చేసి వెంటనే స్టంట్ వేశారు. వారం రోజులు విశ్రాంతి తీసుకోవాలని చెప్పారు.

ఓటుతోనే ప్రజాస్వామ్యం మనుగడ

పంజగుట్ట: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని, ఒకవేళ అభ్యర్థులు ఎవరూ నచ్చకపోతే ఓటింగ్ శాతం పెంచేందుకు నోటాకైనా ఓటు వేయాలని సమాచార హక్కు పరిరక్షణ సమితి జాతీయ చైర్మన్ డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు సూచించారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమితి ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని ఓటరు అవగాహనా సీడీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేశవులు మాట్లాడుతూ... సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీల ఆధ్వర్యంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఆదేశాలమేరకు రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా ఓటరు అవగాహన, చైతన్య కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. డిగ్రీ, పీజీ కాలేజీల్లో అవగాహన కార్యక్రమాలు, సదస్సులు, ర్యాలీలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రజాస్వామ్య మనుగడే ఓటుపై ఆధారపడి ఉందని, మన ఓటును అమ్ముకుని భవిష్యత్ నాశనం చేసుకోరాదన్నారు. ఎన్నికల్లో బరిలో ఉన్న అభ్యర్థులు కూడా ప్రజలకు ప్రలోభాలు పెట్టకుండా స్వేచ్ఛగా ఓటు వేసుకునే అవకాశం కల్పించాలని సూచించారు. రాబోయే ఎన్నికలు పారదర్శకంగా, అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకునేలా తాము కృషి చేస్తామన్నారు. సమితి రాష్ట్ర కన్వీనర్ బోయిన ఉషారాణి, జింకల హరిప్రసాద్, లింగాల ప్రదీప్, శ్రీదుర్గ, రాంబాబు, రేణుక తదితరులు పాల్గొన్నారు.

దళిత బహుజన పార్టీకి 'కప్పు సాసర్' గుర్తు కేటాయించాలి



వినతిపత్రం చూపిస్తున్న నాయకులు

పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్

లిబర్టీ: పార్లమెంటు ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో తమ పార్టీకి కామన్ సింబల్‌గా కప్ సాసరు ఎన్నికల గుర్తు కేటాయించాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు. కప్పు సాసర్ గుర్తు కేటాయించాలని ఈ మేరకు శుక్రవారం ఎన్నికల సంఘం అధికారులకు వినతిపత్రం సమర్పించినట్లు పేర్కొన్నారు. పార్లమెంటు ఎన్నికలతో పాటు ఏపీ అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న తరుణంలో తమ పార్టీ అభ్యర్థులకు కామన్ సింబల్‌గా కప్ సాసర్ గుర్తును కేటాయించాలని ఆ వినతిపత్రంలో ఆయన కోరారు. ఇప్పటి వరకు ఆ గుర్తుపైన తమ అభ్యర్థులు పోటీ చేస్తున్నారని 2024 ఎన్నికల్లో కూడా అదే గుర్తు కేటాయించాలని విన్నవించారు. ప్రజల్లో దళిత బహుజన పార్టీకి మంచి ఆదరణ ఉందని ఇప్పటికే పార్టీ గుర్తుగా అదే ఉందని ప్రచారంలో ఉందని ఆయన చెప్పారు. కమిషన్ స్పందించి తమకు ఆ గుర్తు కేటాయించకపోతే అవసరమైతే సుప్రీం కోర్టుకు వెళ్తామని పేర్కొన్నారు. ఈ ప్రతినిధి బృందంలో బాతు రమేష్, సిద్ధిఖ్ తదితరులున్నారు.

'హిల్స్'లో విద్యుత్ జీరో బిల్లులు షురూ

- అర్హులకు ఎలాంటి ఆందోళన అవసరం లేదు
- ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోని వారికి మరో అవకాశం
- ఇంటింటికీ వెళ్లి అర్హులకు జీరో బిల్లులు అందజేత



జీరో బిల్లు



బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-4 గాంధీపుర బస్తీలో అర్హులకు జీరో కరెంటు బిల్లు అందజేస్తున్న విద్యుత్ సిబ్బంది

బంజారాహిల్స్: తెల్ల రేషన్ కార్డు ఉండి ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకుని 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడుతున్న లబ్ధిదారులకు గృహజ్యోతి పథకం కింద మార్చి ఒకటో తేదీ నుంచి జీరో బిల్లులు అందజేస్తున్నారు. శుక్రవారం ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, అమీర్‌పేట, ఎల్లారెడ్డిగూడ, ఎస్‌కేనగర్ సెక్షన్ల పరిధిలో టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ లైన్‌మెన్లు, అధికారులు లబ్ధిదారులకు జీరో బిల్లులు అందజేశారు. ఈ పథకం కింద లబ్ధి పొందడానికి అర్హులైన వారు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకుని ఉండాలని, వారికే ఈ పథకాన్ని వర్తింపజేశారు.

- ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోలేకపోయిన వారికి ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. తెల్ల రేషన్‌కార్డు ఉండి ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోనివారు మార్చి 1 నుంచి జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయాల్లో విద్యుత్ కనెక్షన్ నెంబర్, తెల్ల రేషన్ కార్డుతో అనుసంధానమైన ఆధార్ కార్డు నెంబర్‌తో దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.
- అర్హత కలిగిన వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, దరఖాస్తులను ధ్రువీకరించిన తరువాత జీరో బిల్లు అందిస్తారని తెలిపారు.
- దరఖాస్తు పెండింగ్‌లో ఉంటే పరిశీలన అయ్యేవరకు విద్యుత్ బిల్లును వసూలు చేయడానికి చర్యలు తీసుకోరని వెల్లడించారు.
- ఇదిలా ఉండగా ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధుల్లో గృహజ్యోతి పథకం కింద సుమారు 80,000 మంది అర్హులు ఉండగా మొదటి రోజున సుమారుగా 10,000 మంది అర్హులకు జీరో బిల్లులు అందాయి.

తిరిగి దరఖాస్తు చేసుకునే అవకాశం

అర్హత ఉన్నా జీరో బిల్లు పొందని గృహ వినియోగదారులు తిరిగి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. జీహెచ్‌ఎంసీ కార్యాలయాల్లో గృహజ్యోతి కోసం దరఖాస్తు చేసుకోవాలి. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోని వారు తాజాగా ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం మరో దరఖాస్తును అందించాల్సి ఉంటుంది. తెల్లరేషన్ కార్డు, లింక్ అయిన ఆధార్, గృహ విద్యుత్ కనెక్షన్ నెంబర్లను జత చేయాల్సి ఉంటుంది. వారు అర్హులని తేలితే సవరించిన బిల్లును జారీ చేస్తారు. ఈ పథకానికి అర్హుల జాబితాలో నమోదవుతారు. అర్హత ఉన్న వినియోగదారులు దరఖాస్తులను ధ్రువీకరించుకునే అవకాశం కల్పించినందున వారి నుంచి బిల్లు రికవరీ చేయడానికి ఎటువంటి బలవంతపు చర్యలు ఉండవు. తెల్ల రేషన్‌కార్డు ఉన్నవారంతా గృహ విద్యుత్ వినియోగానికి దరఖాస్తు చేసుకోవాలి. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అద్దెకు ఉన్న కుటుంబాలు కూడా ఈ పథకానికి అర్హులు.

– హైమానంద, ఏడీఈ బంజారాహిల్స్

చలో మేడిగడ్డ



బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన చలో మేడిగడ్డ పిలుపు మేరకు శుక్రవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మేడిగడ్డను సందర్శించారు.

– కూకట్‌పల్లి

ఓపెన్ స్కూల్ పరీక్షల ఫీజుకు చివరి అవకాశం

మూసాపేట: ఓపెన్ స్కూల్స్ పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలకు అపరాధ రుసుముతో ఈనెల 3వ తేదీ వరకు చివరి అవకాశం ఉందని మూసాపేట ప్రభుత్వ పాఠశాల ఓపెన్ స్కూల్స్ కో–ఆర్డినేటర్ బురాన్ తెలిపారు. రూ.50 అపరాద రుసుముతో పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్ష ఫీజు కట్టుకోవచ్చని అన్నారు. ఆన్‌లైన్‌లో లేదా నేరుగా మూసాపేటలోని ప్రభుత్వ పాఠశాలలో చెల్లించ వచ్చని తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకుల అరెస్టు



పోలీసుల అదుపులో నిందితులు

భాగ్యనగర్‌కాలనీ: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను బాలానగర్ ఎస్‌ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 750 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. కేపీహెచ్‌బీ సీఐ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లాకి చెందిన నందిగామ సాయితేజ, నాగ శ్రీనివాసులు కేపీహెచ్‌బీలోని ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆశతో తూర్పు గోదావరి జిల్లాకు చెందిన సాయి కుమార్ వద్ద రూ.2వేల చొప్పున కేజీ గంజాయిని కొనుగోలు చేశాడు. నగరానికి తీసుకువచ్చి ఎక్కువ డబ్బులకు విక్రయించాలని పథకం వేశాడు. గంజాయి విక్రయిస్తున్న సమాచారం అందుకున్న బాలానగర్ ఎస్‌ఓటి పోలీసులు వారు ఉంటున్న హాస్టల్ రూమ్‌పై దాడి చేసి 750 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని కేపీహెచ్‌బీ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సాంకేతిక విప్లవంతో | భారత్ ముందంజ



సనత్‌నగర్: సాంకేతిక పరిజ్ఞానం భవిష్యత్తులో సామాజిక, ఆర్థిక అంతరాలను తగ్గించే అవకాశం ఉందని ఢిల్లీకి చెందిన రీసెర్చ్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ డెవలపింగ్ కంట్రీస్ (ఆర్‌ఐఎస్‌డీసీ) డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ సచిన్ చతుర్వేది అభిప్రాయపడ్డారు. ఆర్థిక, సామాజిక అధ్యయన కేంద్రం (సెస్) వ్యవస్థాపక దినోత్సవం శుక్రవారం సెస్ ఆడిటోరియంలో జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన సచిన్ చతుర్వేది 'సాంకేతికతతో సమానమైన అభివృద్ధి–ప్రపంచ దక్షిణ భారతదేశం అనుభవం' అనే అంశంపై మాట్లాడారు. మన దేశం సాంకేతికపరంగా మరింత అభివృద్ధి చెందాలంటే వ్యూహాత్మక–ప్రణాళిక, భాగస్వామ్య అభివృద్ధి, సామర్థ్యాలను మెరుగుపరచడంతో పాటు ఆరోగ్యం, వ్యవసాయం, బ్యాంకింగ్‌తో పాటు కీలక రంగాల్లో అడ్డంకులను తొలగించడం ఎంతో కీలకమన్నారు. సాంకేతిక పురోగతిలో భారతదేశ నాయకత్వాన్ని ఎలుగెత్తి చూపడమే కాకుండా ప్రపంచ దక్షిణాది దేశాలకు సాంకేతిక పరిజ్ఞాన నిధిని అందించిందన్నారు. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ), డిజిటల్ పబ్లిక్ గూడ్స్ (డీపీజీ) అనేవి ప్రభుత్వ పెట్టుబడితో ఆవిర్భవిస్తాయన్నారు. డిజిటల్ చెల్లింపుల రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. ఆధార్ యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ), కోవిడ్, ఆయుష్మాన్ భారత్, డిజిటల్ మిషన్ వంటి కార్యక్రమాలు డిజిటల్ విప్లవానికి చిహ్నమన్నారు. సాంకేతిక విప్లవాభివృద్ధిపై ఆర్థిక, సామాజిక అంశాల అధ్యయన కేంద్రం అధ్యాపకులు విశ్లేషణాత్మకంగా పరిశోధనలు చేయాలని చతుర్వేది పిలుపునిచ్చారు. సెస్ వ్యవస్థాపక సభ్యులు, ఇక్ఫాయ్ విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ మహేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సెస్ డైరెక్టర్ రేవతి, ప్రొఫెసర్ హన్మంతరావు, డాక్టర్ జీఆర్‌రెడ్డి, ప్రొఫెసర్ ఇంద్రకాంత్, ప్రొఫెసర్ రవి, డాక్టర్ కేపీ గోయెల్, ప్రొఫెసర్ బలరాములు, డాక్టర్ అలివేలుతో పాటు సెస్ అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో 1.3 మిలియన్ల మంది మృత్యువాత

రాయదుర్గం: భారతదేశంలో గత దశాబ్దకాలంలోనే రోడ్డు ప్రమాదంలో 1.3 మిలియన్ల మంది మృత్యువాత పడ్డారని యూనిసెఫ్ ఇండియా హెల్త్ స్పెషలిస్ట్ సయ్యద్ అలీ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో రోడ్డు భద్రతపై వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచబ్యాంకు నివేదిక ప్రకారం మృత్యువాతలతోపాటు మరో 5 మిలియన్ల మంది గాయపడ్డారని ఆయన వివరించారు. పిల్లల ఆరోగ్యం, మనుగడ, విద్య, రక్షణ భాగస్వామ్యం అవసరమన్నారు. ఆరోగ్యం శ్రేయస్సు, ఆర్థిక వృద్ధిని ప్రభావితం చేసే ఒక ప్రధాన ప్రపంచ అభివృద్ధి సవాలుగా మారిందన్నారు. మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజమ్ విభాగం డీన్, హెడ్ ప్రొఫెసర్ మహ్మద్ ఫరియాద్ మాట్లాడుతూ ఔత్సాహిక జర్నలిస్టులు, మీడియా నిపుణులు ట్రాఫిక్ పై అవగాహన కల్పించడం అవసరమన్నారు. వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్, పలువురు ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



నేడు సబ్బండ వర్గాల ఆత్మగౌరవ సదస్సు

పంజగుట్ట: తెలంగాణలో అధికారంలోకి వచ్చి ప్రజా పాలన అందిస్తామని, సామాజిక న్యాయం పాటిస్తామని అన్న కాంగ్రెస్ పార్టీ రాజకీయ ప్రాతినిధ్యపు అవకాశాలు కేవలం ఒక్క సామాజికవర్గానికే పరిమితం చేస్తూ ఇతర వర్గాలను అపహాస్యం చేస్తున్నదని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే అంశంపై చర్చించేందుకు శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సబ్బండ వర్గాల ఆత్మగౌరవ సదస్సు పేరుతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశానికి తెలంగాణ మేధావులు, ఉద్యమకారులు, నాయకులు, కళాకారులు, జర్నలిస్టులు, న్యాయవాదులు, ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

సీఆర్ ఫౌండేషన్‌లో మహిళలకు నైపుణ్య శిక్షణ కేంద్రం

హఫీజ్‌పేట్: కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్ నీలం రాజశేఖర రెడ్డి రీసర్చ్ సెంటర్‌లో ఉచితంగా మహిళలకు కంప్యూటర్ శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నారు. మహిళలకు స్వయం ఉపాధి కోసం టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మగ్గం, డైయింగ్, ప్రింటింగ్, బ్యూటీషియన్, స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్‌కు సంబంధించిన పరిజ్ఞానం, ట్యాలీ, డీటీపీ తదితర శిక్షణలు ఉచితంగా అందిస్తున్నారు. సంవత్సరానికి నాలుగు బ్యాచ్‌లుగా, ఒకోక్క బ్యాచ్‌కు మూడు నెలల పాటు శిక్షణ కార్యక్రమం ఉంటుంది. ఒక బ్యాచ్‌లో సుమారు 100 మంది మహిళలు ఉంటారు. 15 సంవత్సరాల వయస్సు నుంచి 35 సంవత్సరాల మధ్యలో గల చిన్నారులు, మహిళలు ఈ శిక్షణలో పాల్గొనవచ్చు. వివరాలకు 9603196925 నెంబరుకు ఫోన్ చేయవచ్చు.

ఏ19 క్లబ్ కిచెన్ ప్రారంభం

గచ్చిబౌలి: నైట్ క్లబ్ థీమ్‌తో ఏ19 క్లబ్, కిచెన్‌ను పలువురు సినీ తారలు ప్రారంభించి సందడి చేశారు. కొత్తగూడలోని శరత్ సిటీ క్యాపిటల్ మాల్‌లో సినీ తారలు దీక్షా పంత్, రుచిత సాదినేని, చందన జయరాంలు ఏ19 క్లబ్, కిచెన్‌ను ప్రారంభించారు. నైట్‌క్లబ్ థీమ్‌తో కైనెటిక్ లైట్లు, ఫ్రీజర్ బాక్సులు, టన్నెల్ వ్యూ ఫొటో బూత్ ఉన్నాయి. నైట్ లైఫ్ వారికి మ్యూజిక్, రుచికరమైన ఫుడ్, పర్ఫెక్టింగ్ బీట్‌లు, వివిధ రకాల పనియాలు ఉంటాయి. ఈ కార్యక్రమంలో సన్నీ, అనీల్‌రాథోడ్, శ్రీసత్య, ఇనయ, గీతూ రాయల్, జెస్సీ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే పేదలకు న్యాయం

పంజగుట్ట: పేద ప్రజల సంక్షేమం కేవలం బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీత యాదవ్ అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని ఎం.ఎస్.మక్తా ప్రభుత్వ పాఠశాలలో గత ప్రభుత్వంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద మంజూరైన నిధులకు సంబంధించిన చెక్కులను 40 మంది లబ్ధిదారులకు ఆమె పంపిణీ చేశారు. ఆర్ఐ రాహుల్, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు అహ్మద్, నాగరాజు, నారాయణమ్మ, ఖాసీం, సలీం, ఆజమ్, ఫిరోజ్ పాల్గొన్నారు.